ఢిల్లీ నగరం. డిసెంబర్ నెల. మహానగరంలో మహాచలి ఒంటరిగా ఉన్నవారికే ఇంకాసేపు పడుకుంటె బాగుండనిపిస్తుంది. ఆంధ్రా నుండి హనిమూన్‌కొచ్చిన ఆ జంట ఇంకా రజాయిలోనే దూరి ఉంది. హనిమూన్ను రంగులమయంచేసే వాతావరణ నేపథ్యం ఢిల్లీలో దొరుకుతుందని మరీ వచ్చారు. సమయం ఉదయం ఎనిమిదిన్నర కావస్తుంది.

# ఎంతకాలం!

— డా॥ టి. సంపత్ కుమార్

ఢిల్లీ వచ్చి పదిహేనురోజులయ్యింది. ఇంకో రెండు రోజుల్లో తిరుగుప్రయాణం. దాదాపుగా ఢిల్లీ అంతా తిరిగారు. ఇండియా గేట్ వద్ద రాత్రిపూట వెలుగులో తడిసిపోయారు. కన్నాట్ ప్లేస్‌లో చెట్టా పట్టాలేసుకొని తిరిగారు. విదేశీ జంటల్ని చూసి మేం మీకేం తీసిపోలే దని మరింత దగ్గరయ్యారు. జంతర్ మంతర్ చూసా మనిపించారు. ఎర్రకోట చూస్తుండగా నెర్రి మూడొక టొచ్చి గదికి చేరుకున్నారు. బహాయ్ ప్రార్థనా మందిరంలో ఒకరి కళ్ళలోకి ఒకరు ఎంతసేపు చూసుకున్నారో? రేల్ మ్యూజియంలో బుల్లి ట్రేక్‌లో పిల్లలైపో యారు. పాలికా బజార్‌లోని రష్ ఒకరినొకరి చేయి విడవకుండా నడిపించింది. కరోల్‌బాగ్ కావలసిన సామాన్లు కొనిచ్చింది. పార్లమెంట్ ప్రేమ చతురతను నేర్పింది. రాష్ట్రపతి భవనం ఇరువురిపై విశ్వాసాన్ని పెంచింది. ఘాట్‌లు, స్థల్‌లు ప్రస్తుత పరిధిలో లేవు. అటువైపు కాలు మోపలేదు. ఇక చూడాలనుకున్నది ఒక్కటే- కుతుబ్ మినార్. దాన్ని ఈ రోజు చూడాలి.

"మైడియర్ లేడీ" కళ్ళు మూసుకొనే మెల్లగా అన్నాడు.

"..............." ఏంది కాని కావాలనే జవా బివ్వలేదు. అంగాల కదలికలే చెబుతున్నాయి. ఆమె మెలకువగా వుందని, ఆయనకి తెలు సది. దగ్గరగా హత్తుకున్నాడు. మొహమంతా ముద్దుల ముద్రలు వేస్తున్నాడు. మత్తుగా ఉంది ఇద్దరికి. పెదిమల్ని మెల్లగా చెవిదగ్గరికి తీసుకెళ్లి ఏదో అన్నాడు.

"యూ నాటీ ఫెల్లో.. హౌడేర్‌యూ..." అంటూ మత్తు వదిలించుకొని చన్న లేచి బెడ్ దిగింది. అతనిపై నుండి రజాయిని లాగేసింది. ఇద్దరు నవ్వుకున్నారు...

* * * * * *

ఆటోలో కూచోని "చలో భాయ్ కుతుబ్ మినార్" అన్నాడు. ఆటో దూసుకు పోతుంటే పక్కల నుండి రయ్యంటూ డిసెంబర్ శీతల గాలులు పులవ్ దుస్తుల్ని చొచ్చుకొని చర్మానికి చిల్లులు చేసి ఎముకలకు వణుకు పుట్టిస్తుంది. ఆంధ్రాలో అంతంతచలినే ఎరిగి నవారు మరింత దగ్గరై కూచున్నారు. ఎంత కొత్త జంటైనా ఢిల్లీ వచ్చిన రోజే స్వెట్టర్లు, షాల్ లాంటివి కొనక తప్పింది కాదు.

మాట్లాడినపుడు, శ్వాసవదులుతున్నప్పుడు బయటకొచ్చే ఆవిర్లు ఘనీభవించడం వారికి తమాషాగా వుంది. చిరుమేఘాల్ని చిన్న పిల్లల్లా చూస్తూ ముచ్చటపడి పోతున్నారు. అపుడపుడు వుఫ్....వుఫ్... మంటు ఊదుతూ కంటికి కనబడని ఆవిరి కళ్ళముందే రూపం దాల్చడం గమ్మత్తుగా వుంది. వచ్చినప్పటి నుండి ఈ 'ఆట'తో ఎంతో సరదా పడిపోతున్నారు.

ఆమె స్వెట్టర్‌పై చుట్టుకున్న షాల్‌ను తీసి ఇద్దరికి వచ్చేట్టుగా ముందు నుండి కప్పించి. షాల్ కింద నాలుగు చేతులు పోకిరి ఆట ఆడుకుంటున్నాయ్!

ఆటో డ్రైవర్ ఏమిపట్టనట్లు ఐ.ఐ.టి. దాటి హౌజ్‌ఖాస్ చౌరస్తారాగానే కుడివైపు తిరిగాడు. ఇంకో ఆరేడు నిమిషాల్లో కుతుబ్ మినార్ చేరుకోవచ్చు.

డబ్బులు చెల్లించి "శుక్రియా" అనబోతూ ఒక్కసారే నాలిక్కొరుచుకొని ఆగి "ధన్యవాద్" అని డ్రైవర్‌కు చెప్పి కుతుబ్ మినార్ ఆవ రణ మేన్‌గేట్ వైపు దారితీసారు. హైద్రాబా ద్‌లో 'శుక్రియా' చెప్పే అలవాటును ఢిల్లీ వచ్చాక 'ధన్యవాద్'గా మార్చుకున్నాడు. 'డ్రైవ ర్‌కు శుక్రియా అని చెప్పినా అర్థమవుతుందిలే" అని కన్నింపుగా చూసిందామె.

"అబ్ దిఖావో, యహా పర్ క్యాహై" వచ్చి రాని హిందీలో ఆయన్ను ఆటపట్టించడానికి అంది. జవాబు ఏ భాషలో చెబుతాడా అని ఆసక్తితో ఎదురు చూస్తుంది.

"సబ్ దిఖాయింగె మేమ్‌సాబ్" అంటూ కుడి చేత్తో ఆమె ఎడమ చేతినందుకొని మేన్ గేట్ దాటి ఎడమవైపున్న కుతుబ్ మినార్ వైపు తిరిగారు.

"దేశంలోకెల్లా ఎత్తైన టవర్. 234 అడు గుల ఎత్తున్న ఈ మినార్ డయామీటర్ 47 అడుగులు. ఇది అడుగునుండి క్రమేణా తగ్గుతూ కొనకు చేరేసరికి తొమ్మిదడుగులవు తుంది. మొత్తం ఐదంతస్తులున్నాయి. "చూదు లెక్కబెట్టు".

"వన్.... టూ... త్రీ... ఫోర్... ఫైవ్... యస్..యూ ఆర్ రైట్ మీకెలా తెలుసు. గైడ్‌గా బాగా సరిపోతావ్." అంటూ నవ్వింది. "ఇంకా చెప్ప నువ్వు చెబుతుంటే వినాలనిపిస్తుంది."

"నిజంగానా లేక ఆటపట్టిస్తున్నావా?"

"అబ్బ! నేనేం మాట్లాడినా నీ కెప్పుడు అంతే! ప్లీజ్ చెప్పవూ... "


"అయితే విను"

"ఏడంతస్తుల్లో మొదటి అంతస్తు వరకెళ్ళని చ్చేవారు. నేను కాలేజీ ఎక్స్‌కర్షన్‌లో వచ్చినపుడు చూసాను. పైకెళ్లి మినార్ చివరను చూస్తే కదులుతున్నట్లు థ్రిల్‌గా వుండేది. కొన్ని సంవ త్సరాల క్రితం స్కూలు పిల్లలు మినార్ లోప లున్నప్పుడు కరెంట్ పోవడంతో చీకట్లో భయాం దోళనలు మితిమీరి 'స్టాంపీడ్'కు దారితీసింది. దాంతో నలభైకి పైగా పిల్లలు తొక్కిసలాటలో చనిపోయారు. అప్పటి నుండి దర్శకుల్ని లోనికి వెళ్ళనివ్వడం లేదు..." ఇదంతా మినార్‌ను పైనుండి కిందకు, కింది నుండి పైకి పరీక్షగా చూస్తూచెబుకుపోతున్నాడు.

కాని అప్పటికే ఆమె మినార్‌ను ఎగా దిగా చూస్తున్న అతని ముఖాన్ని అదేపనిగా చూస్తుంది. మినార్‌పై నుండి దృష్టి తనకు తెలియకుండానే అతనిపైకి షిఫ్ట్ అయ్యింది. అతని కళ్ళలో కదలాడుతున్న మినార్‌ను తాను వెదుకుతుందేమో? లేక పొద్దున తొందరలో తీయకుండ వుంచిన గడ్డాన్ని చూస్తూ రాత్రికది కలిగించే గరుకు స్పర్శనూహించుకుంటుం దేమో? మొత్తానికి అతనుచెప్పే విషయాలను చెవులు వినడం ఎప్పుడో మానేసాయి.

ఇదంతా గమనించి అవకాశం దొరికింది కదా అని ఒక్కసారే ఆమెను గిల్లాడు. కెవ్వు మంది. చిరుకోపాన్ని కూడ అభినయించింది.

"ఇంతవరకేం చెప్పానో ఓసారి చెప్ప"



"ప్లీజ్... ఇప్పటి నుండి సరిగా వింటాను. సారీ..."

'నో...నో... చెప్పేంత వరకు వదిలేదిలేదు...

'అయితే విను... కుతుబ్‌మినార్ చార్‌మినార్ కన్నా ఎత్తైనది. దీన్నో రాజు కట్టించాడు... ఊ... ఇంకా... ఇంకా... ఇది ఢిల్లీలో ఉంది...'

'ఇంకానయం దీన్ని మనుషులు కట్టించారన అనలేదు.'

తన ఫేవరేట్ రంగు దుస్తుల్లో ఉన్న ఆమెను చూస్తుంటే ఇప్పుడు మైకం కమ్మడం ఆయన వంతయ్యింది.

'హబ్బీ... ముంగేరి లాల్ కే హసీన్ సప్నేలో మాదిరిగా లోకం మారుస్తున్నావా? చలో... చలో... ఇంకేమైనా చూపుతావా లేక మినార్ దగ్గర మనం 'మినారెట్లమై' పోదామా? చలో... చలో... అంటూ అందరు వెళుతున్న వైపు చేయిపట్టుకొని లాక్కెళ్లింది.

కుతుబ్‌మినార్ నుండి నిదానంగా వెళ్ళి కుడివైపు తిరిగి మెట్లెక్కి, విశాలమైన స్టేజీలా వున్నదానిపైకి వెళ్ళారు. ఓ పెద్ద ద్వారం, చుట్టంతా గోడలు, స్తంభాలు, మధ్యలో సమాధి ఇలా రకరకాల నిర్మాణాలు ఆ స్టేజీ చుట్టూర ఉన్నాయి. ఇవన్ని దర్శకులనంతగా ఆకర్షించవు. కాని ఈ విశాలావరణ మధ్యలో ఒక నల్లని లోహస్తంభముంది. వాడుకలో దీన్ని 'ఐరన్ పిల్లర్' అంటారు.

వాళ్ళు చేరేటప్పటికే చాలామంది టూరిస్టులు పిల్లర్ వద్ద గుమిగూడి వున్నారు. పిల్లర్‌కు వీపువానించి చేతుల్ని వెనుకవైపు నుంచి పిల్లర్ చుట్టూత రెండవైపులా పోనించి చేతులను తాకగలిగితే అదృష్టవంతులంటారు. మనసులో వున్న కోరికలు నెరవేరుతాయని కూడా అంటారు. అందుకే ఎక్కువ మంది కుతుబ్‌మినార్ కంటే పిల్లర్‌ను చూడాలని సరదాపడతారు. పొట్టిచేతుల వారు, పొడుగు చేతులవారు, చిన్నా పెద్దా, అందరూ తమ 'కిస్మత్'ను పరీక్షించుకుంటారు. అందని వాళ్ళ చేతుల్ని జబర్‌దస్తీగా లాగిలాగి శరీరాన్ని స్ట్రెచ్ నరీ చేసి తాకే ప్రయత్నం చేయించడానికి తోటివారు సహాయ పడుతుంటారు. 'అబీ ఔర్ ఏక్ ఇంచ్ గ్యాప్ హై' అంటూనే లేక 'తోడాసా ఛాహియే' అంటూనో ఏదో అదృష్టం చేయిజారి పోయినట్టు చింతించడం, చేతులు తాకగలిగిన వారో నిమాత్న అనుభూతిని పొందడమో టూరిస్టుల ముఖాల్లో స్పష్టంగా గమనించవచ్చు. కుర్రాళ్ళు, అమ్మాయిలైతే చేతుల కలువగానే కేకలు వేయడం, అరవడం, ఎగరడం లాంటివి కూడా జరుగుతుంటాయి. చిలిపివారు, హాస్యప్రియులు చేతులందకపోతే వెంటనే తిరిగి పిల్లర్‌ను ముందునుంచి చుట్టేసుకుంటారు. చేతులవుడు తప్పక కలుస్తాయి. 'కస్మత్‌కు పీచేసే నహీ, ఆగేసే సహాంఛ్‌నా ఛాహియే!' అంటూ నవ్వుకుంటూ నవ్విస్తూ వెళ్ళిపోయేవారు కొందరుంటారు!

ఇక తనవంతు వచ్చిందన్నట్టుగా అతను వెళ్ళాడు. పిల్లర్‌కు వీపు తగిలేట్టుగా, సిపాయిలా, అటెన్షన్ ఫోజులో నిలుచున్నాడు. చేతుల్ని మెల్లగా వెనక్కు కదిపాడు. ఆమె వన్‌డే క్రికెట్‌లో గెలుపో ఓటమో తెలిపే చివరి బంతిని కొట్టేందుకు సిద్ధంగా ఉన్న బ్యాట్స్‌మెన్‌ను చూస్తున్నంత ఉత్కంఠతో రెప్పలార్పకుండా చూస్తుంది. చేతులు మెల్లగా, మెల్లమెల్లగా వెనుకవైపు కదులుతున్నాయి. గ్యాప్ క్రమేణా తగ్గుతుంది. ఆయన చేతులు నున్నని పిల్లర్ చుట్టుతూ ప్రాకుతుంటే ఆమెకు ఒల్లంత పులకింతలొస్తున్నాయి. తన నడుంమీదే చేతులు కదులుతున్నట్టనిపించి తడుముకుంది. తరువాత నవ్వుకుంది గ్యాప్ తగ్గుతూ చివరకు చేతులు చక్కగా కలుసుకున్నాయి. 'వ్వా... గ్రేట్' అంటూ పిల్లర్‌ను వదిలివస్తున్న ఆయన అరచేతిలో క్రికెట్ స్టైల్లో విజయపూర్వకంగా తన అరచేత్తో చరిచింది.

'అయితే నువ్వు అదృష్టవంతునివన్న మాట'

'అందుకేగా, నీలాటి భార్య దొరికింది.'

'అచ్ఛా!' అంది కొంటెగా. లోలోపల గర్వ పడుతున్నా బయటకు కనబడనీయలేదు.



'ఇవుదు నీవంతు వదు'

'వాకు వమ్మకం లేదు. కావాలంటే విన్ను ముట్టుకుంటాను' అంది చిలిపిగా.

'ఆ వని రాత్రివూట చేద్దువులే'. వడవ మంటూ తొందర పెట్టాడు. ఇబ్బందిగా వెళ్ళి ఫిల్లరు కామకొని చేతుల్ని వెవక్కిపోనిచ్చింది. కలవలేదు. బెత్తెడుకు పైగా గ్యావుంది. ఒళ్ళు విరిచింది. చేతివేళ్ళు టెంటకిల్స్‌లా కలుసుకు నేందుకు వెలుతురులోనే వెతుక్కుంటున్నాయ్! ప్చ్... లాభంలేదు. ఇంకా గ్యావుంది! ఆయవ ఆమె రెండు చేతుల్ని పట్టుకొని అదృష్టసీమలోకి తీసుకెళ్ళేందుకు తటాలున లాగాడు. ఆమె వక్షం ఒక్కసారే ముందుకు పొదుచుకుంది. గాలికి చైతన్యం వచ్చి 'రయ్'మని ముందుకు వీస్తూ పోయింది. అదృష్టం అందవంటుంది. అంగాలు అంతుకుమించి స్ట్రెచ్‌కావంటున్నాయి! •

'ముందుమండి అందుకోవా?' అంటూ తిరిగింది.

'ఆ వని మాత్రం చేయకు. పిల్లర్‌కు ప్రాణ మొస్తుందేమో?' సూటిగా కళ్ళలోకి చూస్తూ అన్నాడు.

'ఈ పిల్లర్ ప్రత్యేకత మరోటుంది, తెలుసా' అని అడిగాడు.

'ఇంకా వుందా. అబ్బ! కాస్సేపు అక్కడ కూచుందాం వదు' కొద్ది దూరంలో ఉన్న రాయిగోడ వైపు చేయిపట్టుకొని లాగుతూ తీసుకువెళ్ళింది.

చూస్తుండగావే రష్‌పెగిరిపోతుంది. వివిధ బాషలు వినిపిస్తున్నాయి. తెలుగుభాషా వినిపిస్తుంది. అపుడప్పుడు. రంగు రంగుల చలికాలపు దుస్తులతో జవం మొగల్‌గార్డెన్స్‌ను గుర్తుకు తెస్తున్నారు. పదిహేను రోజుల మంచి రంగులమయంగా సాగుతున్న ఆ జంటకు అక్కడి వాతావరణమంతా సరిగ్గా సరిపోతుంది.

'పిల్లర్ గురించి ఇంకేమో చేప్తానన్నావ్. ఇక్కడ కూచున్నపుడు చెప్పరాదూ?' గోముగా అడిగింది.

"ఈ పిల్లర్ ఎన్నో వందల సంవత్సరాల నుండి చెక్కు చెదరకుండా, తుప్పపట్టకుండా వుంది. ఎలాటి రక్షణ లేకుండా ఎండల్లో, వావల్లో శతాబ్దాల కొద్దీ ఇలాగే వుంది. ఈ పరిశీలవ ఆధారంగా మన దేశంలో ఆ కాలంలో లోహశాస్త్రం మరియు దాని సంబంధిత విజ్ఞానంలో మన దేశం ఎంతో ముందుండేదని చెప్తుకుంటారు. దీనికి నిదర్శనమే మన కళ్ళ ముందు నిల్చొని సవాలు చేస్తున్న ఈ పిల్లర్! ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే ఇంతటి మహత్తర శక్తి వున్న ఈ లోహపు కంపోజిషన్ను తెలుసుకోడానికి కొందరు సైంటిస్టులు పిల్లర్ నుండి సాంపిల్స్ తీసుకెళ్ళి విశ్లేషించారు. ఘటకాలను కూడా తెలుసుకున్నారు."

ఆసక్తిగా వింటుందామె.

"ఏయ్! ఒక మాంచి ఐడియా! విన్ను కాలేజీ రోజుల నుండి చూస్తున్నాను. ఇప్పటికి ఆరు సంవత్సరాలు కావస్తుంది. అప్పటికీ, ఇప్పటికీ నీ అందం చెదరకుండా కందిగింజలా అలాగే వుంది. నీ శరీరం నుండి కూడా కొంత సాంపిల్ తీసి ఏ జెనిటిక్ ఇంజనీర్‌కో లేక డి.ఎన్.ఎ. సైంటిస్టుకో ఇచ్చి నీ అందం వెనకాల వున్న చిదంబర రహస్యమేమిటో తెలుసుకుందాం."

"కొయ్‌రాజా కొయ్... కానీయ్ రాజా కానీయ్... అందర్నీ వాలా తయారు చేస్తూ పోతే మొగుళ్ళకు పెళ్ళాలను వెతుక్కోవడం కష్టం కాదటోయ్... మా చెల్లెల్ని నా పక్కన నిలబెడితే నీ పెళ్ళాం ఎవరో తెలుసుకోక గాబరా పడతావ్... జెనిటిక్స్ చదువుకోలా... జీవరాశుల్లో వైవిధ్యం అవసరమని..." అంటూ ముక్కు కొవను సుతారంగా ఊపి ఓ ఫోజు పెట్టిందామె.

ఆయన మృదువుగా ఆమె తొడను నొక్కుతూ "లే... ఇంకా కొంత చూసేదుంది" అంటూ లేచాడు.

ఇద్దరు పిల్లర్‌ను దాటి నిదానంగా పోయి మెట్లు దిగి రాళ్ళమధ్య నుండి నడుస్తూ 'అలైమివార్' వైపు నడిచారు.

ఫలకానికి పక్కనే వున్న అలైమివార్‌ను ఎక్కువ మంది పట్టించుకోరు. గమనించినా చూసేందుకు ఆసక్తి చూపరు. కొద్దిగా కష్టపడితే లోపలికెళ్ళి చూడొచ్చు.

అవసరానికి మించిన ఆసరాతో చేతులందించుకుంటూ ఆమె ఆయన సహాయంతో అలైమివార్ లోపలికెళ్ళగలిగింది. ఎవరూ లేరు. ఎంతో సేపటి నుంచి రాజుకుంటున్న 'వెర్రి' పెల్లుబికి ఒక్కసారే ఆమెను ముద్దుపెట్టుకున్నాడు. మరొకటి... ఆపై మరొకటి... ఆమె కూడా విరోధించలేదు. క్షణాలు గడిచాయి... ఎవరో వస్తున్న అలికిడి విని అలైమివార్ అంతర్భాగం చుట్టూ నడిచి 'దర్జాగా' కిందికి దిగారు.

అలైమివార్ దగ్గర్లో ఓ చిన్న లానుంది. అక్కడ కాస్సేపు కూచోని చుట్టంతా గమనిస్తూ రోమాంటిక్ మూడ్‌లో మాట్లాడుకుంటున్నారు. మధ్య మధ్యలో అలైమివార్‌వైపు ఆశగా చూస్తున్నారు. ఎక్కడి నుండో ఓ స్కూలు పిల్లల గుంపొకటి అలైమివార్‌వైపు అస్తవ్యస్తంగా వచ్చింది. ఇక లాభం లేదని కుతుబ్‌మివార్ ఆవరణ నుండి బయట పడ్డారు. చలిగాలులు తమకేమి పట్టనట్లుగా వీస్తూనే వున్నాయ్!

* * * *

న్యూఢిల్లీ రైల్వేస్టేషన్ జనంతో కిటకిటలాడుతూంది. హైద్రాబాద్ బయలుదేరే ఎ.పి. ఎక్స్‌ప్రెస్ నియమిత సమయానికి నలభై నిమిషాల ముందొచ్చింది. గుండెనిండా తీపి అనుభవాలతో నిండుకున్న ఆ జంట టూ-టైర్ ఎసి బోగీలో సామానంతా సర్దుకుని అంటుకొని కూచున్నారు. హైదరాబాద్‌లో కాపురం పెట్టబోయే ఆ జంటకు ఢిల్లీ అనుభవాలు మంచి పటిష్ఠతను చేకూరుస్తాయి. ఇక సంసారం సునాయసంగా 'టేకాఫ్' తీసుకోవాలి మరి! చిత్రవర్ణాల్ని నింపుకున్న ఆ గుండెలు ఆంధ్రాలో ఇంద్రధనస్సుగా బహిర్గత మయ్యేందుకు గంటలు లెక్క బెడుతున్నాయి. ఇంకో పదిహేను నిమిషాలుంది, ట్రైను బయలుదేరడానికి.

* * * *

రాజు పై చదువులకు అమెరికా వెళ్ళేందుకు ఢిల్లీలో పనులన్నీ పూర్తి చేసుకుని వెళ్ళే ముందు తల్లిదండ్రుల్ని కలిసేందుకని ఎ.పి. ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ బయలుదేరాడు. ఇంకో పది రోజుల్లో బోస్టన్‌లో వుంటానని ఊహించుకుంటూ తాను దీనికోసం ఎంత ప్రయాసపడాల్సి వచ్చిందో పునరావృతం చేసుకుంటున్నాడు.

ప్రొఫెసర్ కేశవరావు ఐ.ఐ.టి. ఢిల్లీ నుండి రిటైర్మెంటు తీసుకుని కుటుంబంతో సహా ఆంధ్రాలో స్థిరపడడానికి అదే ట్రైనులో ప్రయాణం చేస్తున్నాడు. బంధుమిత్రులకు దగ్గరలో వుండబోతున్నందుకు అందరికీ సంతోషంగా వుంది.

రమణమ్మ తన కొచ్చిన వ్యాధికి ఆంధ్రాలో సరైన చికిత్స దొరక్కపోతే ఓ తెలిసిన ఎం.పి. సహాయంతో ఢిల్లీలోని ఎ.ఐ.ఐ.ఎం.ఎస్.లోని డాక్టర్ల పుణ్యాన మామూలు మనిషయ్యింది. మనవడితో ప్రయాణం చేస్తున్న రమణమ్మకు ఎపుడెపుడు ఆంధ్ర చేరుకుంటానన్న కుతూహలం ఎంత ఆపుకుందామన్నా ఆగడం లేదు.

ఇంకో ఐదు నిమిషాలు... నాలుగు... మూడు... రెండు... ఒకటి... మరో రెండు నిమిషాలయ్యాక పచ్చ జెండా ఊగడం, ట్రైన్ బయలుదేరడమూ జరిగాయి.

అదే ట్రైన్‌లో నాలుగు బోగీల్లో నాలుగు బ్రీఫ్ కేసులున్నాయి. వీటికి సంబంధించిన ప్రయాణీకులు మాత్రం ట్రైన్‌లో లేరు. బ్రీఫ్ కేస్‌లోని గడియారం చేసే టిక్‌టిక్ శబ్దం మాత్రం ఎవ్వరికీ వినిపించడం లేదు.

కడ్‌కడ్‌కడ్ కడ్... ట్రైన్ స్పీడుగా పోతుంది. టైమ్‌కే బయలుదేరిందని ప్రయాణీకుల ముఖాలపై తృప్తి.

కడ్ కడ్ కడ్ కడ్ కడ్...

టిక్... టిక్... టిక్... టిక్... గడియారాలు బ్రీఫ్ కేసుల్లో తమ విధులను నిర్వర్తిస్తున్నాయి. వాటికి తెలియదు... ఆరున్నరకు తమ ఉపయోగం తీరుతుందని...

సరిగ్గా ఆ... రు... న్న... ర ...

ఢాం...! ఢాం...! ఢాం...!

ఒకేసారి నాలుగు బోగీల్లో టైంబాంబులు...

బోగీలు చెల్లాచెదురయ్యాయి. జీవితాలు గాలిలో కలసి పోయాయి.

డీరైల్‌మెంట్... ఆకాశం నుండి అగ్గిపెట్టల్ని విసిరేసినట్టుగా పడి వున్నాయి బోగీలు. అంతా అస్తవ్యస్తంగా వుంది. మంటలు... మారణకాండ...

ఓ జంట... ఓ రాజు... ఓ కేశవరావు... ఓ రమణమ్మ... ఓ అబ్దుల్.. ఓ థామస్... ఓ జోగిందర్ సింగ్.. ఎందరో... ఇంకా ఎందరెందరో...

అర్థాంతరంగా ముగిసిన జీవితాలు..!

* * * *

